క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కోణం శ్రీనివాస్ సోమవారం డాక్టరేట్ అందుకున్నారు. తెలంగాణ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ హైదరాబాద్‌లోని అల్లైడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్‌కు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర నారాయణ డాక్టరేట్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలూరి విల్సన్, డాక్టర్ పీవీసీ అంజనీకుమారీ, డాక్టర్ ఎన్.ఇందిరా, డాక్టర్ సి.నారాయణస్వామి, డాక్టర్ తరుణ్‌కుమార్ మహత పాల్గొన్నారు.

షాపుల అద్దెకు బహిరంగ వేలం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని తులసీ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో నాలుగు షాపులు నెలవారీ అద్దెకు, అదే విధంగా కొబ్బరికాయ చిప్పలు సేకరించేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ కుశలయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు జూన్ 16వ తేదీన ఆలయంలో నిర్వహించే బహిరంగ వేలంకు హాజరుకావాలన్నారు.

సీపీఎం నాయకుల అరెస్ట్

నల్లగొండ టౌన్: సీపీఎం నాయకులను సోమవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఆవుట రవీందర్ మాట్లాడుతూ ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు లేకున్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాలంటూ తమను అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని గతంలో ఆందోళనలు చేశామని తెలిపారు. కానీ సోమవారం ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయనప్పటికీ అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో గల కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ యువజ నాయకుడు, సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్‌యాదవ్ సోమవారం రూ.55వేల విరాళం అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్, సుఖేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: సూర్యాపేటలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించేందుకు సోమవారం హైదరాబాద్ నుంచి వస్తూ మార్గమధ్యలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిట్యాలలోని పాల కేంద్రం వద్దకు వచ్చారు. వీరితోపాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఉన్నారు. ఈ క్రమంలో చిట్యాల నుంచి ఉరుమడ్ల మీదుగా మునుగోడు వరకు బస్సు సర్వీసు, ఉరుమడ్ల నుంచి హైదరాబాద్‌కు నైట్ హాల్ట్ బస్సు సర్వీసు, దేవరకొండ నుంచి ఉరుమడ్ల మీదుగా యాదగిరిగుట్టకు ఆర్‌టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఉరుమడ్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, నాయకులు పల్లపు బుద్ధుడు, పట్ల జనార్దన్, పాకాల దినేష్, రూపని యాదయ్య, మర్రి రమేష్, మర్రి శ్రీకాంత్, ఉయ్యాల నరేష్, ఎలిమినేటి హరిప్రసాద్ ఉన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళి


నివాళులర్పిస్తున్న శ్రీరాం సేన నాయకులు

నల్లగొండ టూటౌన్: హిందూ సామ్రాజ్య దివస్‌లో భాగంగా రాష్ట్రీయ శ్రీరాంసేన ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని శివాజీ నగర్ సెంటర్లో శివాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రీయ శ్రీరాంసేన జాతీయ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ మాట్లాడుతూ శివాజీ మహరాజ్ మొగల్ సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకలించి హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించిన రోజును హిందూ సామ్రాజ్య దివస్‌గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. హిందూ స్వరాజ్య స్థాపన కోసం రాష్ట్రీయ శ్రీరాంసేన కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్త లింగస్వామి, సత్యనారాయణ, పెనుగొండ సురేష్, కోణం కరుణాకర్, సుమన్, శ్రీరాంసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటీఎం సౌకర్యం లేక ఇక్కట్లు !

- నగదు విత్‌డ్రా కోసం గంటల కొద్ది బ్యాంకుల్లో పడిగాపులు
- అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్న కేతేపల్లి మండల ప్రజలు


కేతేపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నగదు విత్‌డ్రా కోసం గుంపులుగా ఖాతాదారులు(ఫైల్)

కేతేపల్లి: మండలంలో ఏటీఎం సౌకర్యం లేక నగదు కోసం బ్యాంక్ ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ కేతేపల్లి మండలవాసులకు మాత్రం ఏటీఎం సౌకర్యం లేకుండా పోయింది. అకౌంట్ పాసు పుస్తకం ప్రింటింగ్, స్టేట్‌మెంట్, నగదు జమ తదితర సేవలన్నీ నేడు డిజిటల్‌మయంగా మారాయి. కానీ కేతేపల్లిలో ఏటీఎంలు లేకపోవడంతో నగదు విత్ డ్రా కోసం బ్యాంకు ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయ బ్యాంకులు ఒక్కటి కూడా లేవు

కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు మరో ఐదు ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 37 వేల జనాభా ఉంది. వీరిలో దాదాపు 25 వేల మందికి బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. కాగా మండలం మొత్తానికి రెండు తెలంగాణ గ్రామీణ బ్యాంకులు మాత్రమే సేవలు అందిస్తున్నాయి. జాతీయ బ్యాంకులు ఒక్కటి కూడా లేవు. ఒకటి మండల కేంద్రంలో కాగా.. మరొకటి భీమారం గ్రామంలో ఉంది. ఈ రెండు బ్యాంకులకు సంబంధించి ఒక్కచోట కూడా ఏటీఎం లేదు. రెండే బ్యాంకులు ఉండడంతో నగదు తీసుకోవడానికి ప్రజలు నిత్యం కష్టాలు పడాల్సి వస్తోంది. రూ.500 నగదు అవసరమున్నా బ్యాంకుల్లో గంటల తరబడి లైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

15 కి.మీ వెళ్లాల్సిందే..

ఖాతాదారులకు ఏటీఎం కార్డులు ఇస్తున్న బ్యాంకు అధికారులు ..ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఆసక్తి చూపడం లేదు. నగదు తీసుకోవడానికి గంటల కొద్ది బ్యాంకుల్లో బారులుదీరాల్సి వస్తోంది. సెలవు దినాల్లో నగదు కావాలంటే ఇక్కట్లు పడాల్సిందే. దీంతో ఎక్కువగా రైతులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు ధాన్యం డబ్బులు తీసుకోవడానికి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, రైతు భరోసా డబ్బుల కోసం బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. రాత్రి వేళల్లో నగదు కావాలంటే 15 కి.మీ దూరం ఉన్న సూర్యాపేట, నకిరేకల్ పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కేతేపల్లి మండల కేంద్రంలో ఏటీఎం కేంద్రం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏటీఎం కేంద్రం ఏర్పాటు చేయాలి



బ్యాంకులో నగదు తీసుకోవడానికి వెళ్తే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సమయం వృథా కావడంతోపాటు సకాలంలో డబ్బులు తీసుకోలేకపోతున్నాం. సెలవు దినాల్లో డబ్బులు అవసరముంటే నకిరేకల్ పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. బ్యాంక్ అధికారులు స్పందించి కేతేపల్లిలో ఏటీఎం కేంద్రం ఏర్పాటు చేయాలి. – ఎ.సైదులు

ఇబ్బంది పడుతున్నాం



బ్యాంకు సెలవు రోజుల్లో నగదు తీసుకోవడం ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లేందుకు డబ్బులు అవసరమైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలో ఏటీఎం సెంటర్ అందుబాటులో ఉంటే డబ్బు తీసుకునే అవకాశముంటుంది. – ఎస్‌కే.యూసుఫ్ అలీ, కొత్తపేట

బ్యాంకు మిత్ర సేవలు అందిస్తున్నాం



తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో ఏటీఎంలు లేవు. బ్యాంకు పరిధిలోని అన్ని గ్రామాల్లో బ్యాంకు మిత్ర సేవలు అందిస్తున్నాం. రూ.30 వేల వరకు నగదు అక్కడే తీసుకోవడం, రూ.50వేల వరకు జమ చేసే వెసులుబాటు ఉంది. చిన్న మొత్తంలో నగదు అవసరమైన వారు బ్యాంకు వరకు వచ్చి ఇబ్బంది పడొద్దు. – వెంకటేశ్వరావు, మేనేజర్, టీజీబీ, కేతేపల్లి

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా


తిప్పర్తి : సమస్యలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వివరిస్తున్న అధికారులు


మాడ్గులపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తిప్పర్తి : రాష్ట్రంలోనే నల్లగొండను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులకు సర్పంచ్‌లకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. తిప్పర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం చేపడతామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. తిప్పర్తి మండలంలోని ప్రభుత్వ భూములను అర్హులకు ఇవ్వాలని, కబ్జాకు గురైన భూములు సర్వే చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తిప్పర్తి మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసి పేదలకు అందజేస్తామని మంత్రి తెలిపారు. తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో మౌలిక వసతులకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాగులవంచ లింగారావు, తహసీల్దార్ పరుశురాం, ఎంపీఓ జానయ్య, నాయకులు పాశం నరేష్‌రెడ్డి, రొట్టెల రమేష్, పల్లె ఎల్లయ్య, కిన్నెర అంజి, బత్తిని మట్టయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి

మాడ్గులపల్లి: నూతనంగా ఏర్పడిన మాడ్గులపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల భవనాల నిర్మాణానికి స్థలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. 20 రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి త్వరగా పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, వెంకన్న, నరేష్, యాదగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతులు


నల్లగొండ: కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ

నల్లగొండ: విద్యుత్ అంతరాయ నివారణకు నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో 11కేవీ లైన్ ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి మాజీ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ వినతి పత్రం అందజేశారు. శ్రీరామ్‌నగర్ కాలనీ, అమూల్య కాలనీ, రామకృష్ణనగర్ తదితర కాలనీల్లో లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలని విన్నవించారు. అదేవిధంగా 3,18,19 వార్డుల్లో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పేర్ల అశోక్, పెరిక యాదయ్య, ముశం దశరథ, యాకాల వెంకన్న ఉన్నారు.

వేతనాలు పెంచాలని..

నల్లగొండ టౌన్: మండల మహిళా సమాఖ్య కార్యాలయాల్లో అటెండర్లుగా పనిచేస్తున్న వారికి వేతనాలను రూ.18వేలకు పెంచాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అటెండర్లకు రూ.2వేలు నుంచి రూ.6వేలు వరకు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉల్లెందుల సైదులు, లింగమ్మ, సుదర్శన్, కమలమ్మ, సుధాకర్, మణమ్మ, సైదమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ అటెండర్లను తొలగించాలని..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీసీ గురుకులాల్లో విద్యార్హతలు లేకుండా ఏజెన్సీ ద్వారా నియమించబడిన ల్యాబ్ అటెండర్లను తొలగించాలని కోరుతూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీ గురుకులాల్లో ల్యాబ్ అటెండర్ ఉద్యోగానికి ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపు అర్హత ఉండాలని, కనీసం పదో తరగతి చదవని వారిని ల్యాబ్ అటెండర్లుగా నియమించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో బీసీ సంఘం నాయకులు పగిడి జీడయ్య యాదవ్, కర్నాటి యాదగిరి, మార్గం సతీష్ కుమార్, గడగోజు విజయకుమార్, దీకొండ నవీన్, రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని..

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని బంగారిగడ్డలో రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్ డే లో సుమారు 30 మంది బాధితులు కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. తమకు తగిన పరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, లక్ష్మయ్య, ముత్తయ్య, యాదయ్య, వెంకటేశం, సైదులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కనగల్: పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఆండాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ. ఖాసీం మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు సొంత డబ్బులతో పనులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాలుగు సంవత్సరాల విధి నిర్వహణ కాలాన్ని సర్వీస్‌గా గుర్తించాలన్నారు. ఉపాధి హామీ సామాజిక తనిఖీల నుంచి కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


కనగల్: దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

మర్రిగూడ: భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చండూరు ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. సోమవారం మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి, వట్టిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రమణారెడ్డి మాట్లాడుతూ లెంకలపల్లి గ్రామంలోని రైతుల నుంచి 39, వట్టిపల్లి గ్రామంలో 119 మొత్తం 158 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్ఐలు పాండురంగారెడ్డి, జహీరొద్దీన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి : రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సోమవారం తిప్పర్తి మండలంలోని పజ్జూరు, గంగన్నపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పరుశురాం మాట్లాడుతూ పజ్జూరు గ్రామంలో 60, గంగన్నపాలెంలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ ద్రోణార్జున తదితరులు ఉన్నారు.

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి, పిట్టంపల్లి గ్రామాల్లో అధికారులు సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కురుమర్తిలో గ్రామంలో 166, పిట్టంపల్లిలో 43 దరఖాస్తులు స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్బర్ట్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం గ్రామంలో సోమవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 44 మంది రైతులు తమ దరఖాస్తులను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పద్మ, సీనియర్ అసిస్టెంట్ విఘ్నేశ్వర్‌రెడ్డి, జీపీ కార్యదర్శి దేవిరెడ్డి పద్మ, జూనియర్ అసిస్టెంట్లు ఎస్.కె లతీఫ్, సరిత, పద్మ రైతులు దేప నర్సిరెడ్డి, కొమ్మగోని పాపయ్య, చీదేటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ఓపెన్ ఫోరం


ఓపెన్ ఫోరంలో పాల్గొన్న అధికారులు

నార్కట్‌పల్లి : ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఉపాధి హామీ పథకం ప్రొసీడింగ్ ఆఫీసర్ నవీన్‌కుమార్ అన్నారు. నార్కట్‌పల్లి మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సోమవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నార్కట్‌పల్లి మండలంలో 2024–25 సంవత్సరంలో 4 కోట్ల 10 లక్షల రూపాయల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. సామాజిక బృందం పది రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనుల అమలు తీరును సమీక్షించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ సుధాకర్, ఏపీఓ యాదయ్య, టీఏలు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం


మునుగోడు: ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

కనగల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కనగల్ ఎంపీడీఓ టి.జయరాం అన్నారు. సోమవారం కనగల్ మండలంలోని చర్లగౌరారం, ఇస్లాంనగర్, ఎస్ లింగోటం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేసి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చర్లగౌరారం గ్రామానికి 35, ఎస్ లింగోటంకు 30, ఇస్లాంనగర్‌కు 11 చొప్పున మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు కూసుకుంట్ల రాజారెడ్డి, ఎంపీఓ కె.సుమలత, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి చీదేటి సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిలుకరాజు సునీతవెంకన్న, ఎఫ్ఏ డి.సైదులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం

మునుగోడు: మండలంలోని కొంపల్లి గ్రామంలో 23 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. కాగా సోమవారం 15 మంది ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, వెదిర విజయందర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ అనిల్, పంచాయతీ కార్యదర్శి స్వామి, బోయపర్తి ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి హైస్కూల్‌లో 2007–2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహారెడ్డి, వెంకటేశం, అనంతరావు, కూరెళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం


కేతేపల్లి: చెర్కుపల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి పాఠశాలలను కాపాడుకోవాల్సి బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కేతేపల్లి ఎంఈఓ ఆకవరం రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చినబొస్కు ప్రసాద్, హెచ్ఎం డి.రాజబాబు, ఉపాధ్యాయులు రమేష్, వెంకటమోహన్, శంకర్, కవిరాజు, సరిత, శ్రీనివాస్, రేణుక, జయసాగర్, సీఆర్పీ కె.మహేందర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటా వెళ్లి ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వంటల వెంకటేశ్వర్లు, పాఠశాల చైర్మన్ ఉమా, ఉపాధ్యాయులు తాటిపాముల నర్సింహమూర్తి, లింగాల నగేష్, కల్పన పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు అన్నారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామంలో పాఠశాల కరపత్రాలను ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని అన్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కొంక ఆంథోని, అబ్దుల్ గఫూర్, చిన్ని శ్రీనివాస్, చంద్రయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.లుకేందర్‌రెడ్డి, భవాని, ఎస్ఎంసీ మాజీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్, ఉపాధ్యాయులు బంగపట్ల తిమ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : ప్రైవేటు పాఠశాలలు వద్దు, ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని నార్కట్‌పల్లి ఎంఈఓ నర్సింహ అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి, కొడూరు, పడమటితండా, అజ్జిలాపురం, తమ్మడపల్లి, తిరగండ్లపల్లి గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, వాసుదేవరావు, జీవన్‌సాగర్, వెంకటావతి, ఉదయశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, శ్రీనివాస్‌రెడ్డి, దివ్య, నరేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో నల్లగొండ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది పెన్షనర్లకు హైదరాబాద్ యశోద ఆస్పత్రి కార్డియాలజిస్టు, జనరల్ మెడిసిన్ డాక్టర్లు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కంటి పరీక్షలు కూడా నిర్వహించారు. అనంతరం వైద్యులను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, జెల్లా పుల్లయ్య, జి. సుధాకర్, టి.రమేష్, ఎం.శేషారెడ్డి, ఎం.కేశవాచారి, పాండురంగం, మహేశ్వర్, చక్రపాణి, ఆజం అలీ, మహ్మద్‌హుస్సేన్, ఎన్.బాలరాజు, రంగయ్య, ఆంజనేయులు, జి.రాములు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం వద్ద సీపీఎం నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుగట్టు ఆర్చీ వద్ద బ్రిడ్జి లేక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అధికారులు పరిశీలించి ప్రమాదాల నివారణ కోసం బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమ్మరి శంకర్, దండు రవి, వాసుదేవ్, మేడి అశోక్, నాగరాజు, సత్యనారాయణ, సైదులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


మొక్క నాటుతున్న వీరారెడ్డి

మర్రిగూడ: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్‌నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, జిల్లాకుల సైదులుయాదవ్, వేనేపల్లి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శులు చాపల వెంకటేష్, రాకొండ ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శులు అంబాల రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయంలో పూజలు


బోనం తీసుకెళ్తున్న పాల్వాయి స్రవంతి

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయ కలశ స్థాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి స్వామివారికి బోనం నైవేద్యంగా సమర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

మునుగోడు: పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మునుగోడులోని పలు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారగోని అంజయ్య గౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పాల్వాయి వెంకట్‌రెడ్డి, యడవల్లి సురేష్, ఈద శరత్‌బాబు, ఐతగోని విజయ్, దుబ్బ రాజు, లింగయ్య పాల్గొన్నారు.

నాంపల్లి: మాజీ ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం నాంపల్లి ప్రాథమిక ఆస్పత్రిలో రోగులకు నాంపల్లి సంజీవ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు కర్నె యాదయ్య, గంజి సంజీవ, గౌరు కిరణ్, కస్తూరి రామ్, ఎదుళ్ళ యాదగిరి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.